RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 269 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | శుక్రవారం 14 - 8 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

## బంగ్లాదేశ్‌లో తీవ్ర విద్యుత్ సంక్షోభం..
### భారత్ సాయం కోసం ఎదురుచూపు

బంగ్లాదేశ్ తీవ్ర విద్యుత్ సంక్షోభంతో అల్లాడుతోంది. దేశవ్యాప్తంగా 10-16 గంటల పాటు విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. మార్కెట్లు, షాపింగ్ మాల్స్‌ను రాత్రి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలని ప్రభుత్వం కొత్త నిబంధనల్ని అమలు చేస్తోంది. దేశంలోని అన్ని బిల్ బోర్డులను సాయంత్రం 7 గంటల లోపు ఆపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని డెకరేషన్ లైట్లు కూడా పూర్తిగా నిలిపేయాలని చెప్పింది. బంగ్లాదేశ్ విద్యుత్, ఇంధన మరియు ఖనిజ వనరుల మంత్రిత్వ శాఖ బుధవారం సాయంత్రం జారీ చేసిన ఒక ఉత్తర్వులో ఈ నిర్ణయాలను ప్రకటించింది.

## పాకిస్తాన్‌లో 62 మంది మిలిటెంట్లు హతం..

పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో 36 గంటల పాటు నిఘా సమాచారం ఆధారంగా జరిపిన వరుస ఆపరేషన్లలో 60 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారని భద్రతా అధికారులుతెలిపారు. దేశ వాయువ్య ప్రాంతంలోని ఉత్తర వజీరిస్తాన్, బన్నూ జిల్లాల్లో ఈ ఆపరేషన్లు జరిగాయి. ఉత్తర వజీరిస్తాన్‌లో మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించిన ఆపరేషన్లలో నలుగురు కీలక కమాండర్లతో సహా 52 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, బన్నూలో జరిగిన పలు ఆపరేషన్లలో 10 మంది ఉగ్రవాదులు హతమవ్వ గా 16 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఉత్తర వజీరిస్తాన్‌లో ఫిత్నా అల్-ఖవారిజ్ మిలిటెంట్లపై లక్షిత దాడికి ముందు భద్రతా దళాలు అనుమానిత ప్రాంతాలపై నిఘాను కట్టుదిట్టం చేశాయి.

# లంచాల మత్తులో సివిల్ సప్లై శాఖ?

**డీ టీలు వసుల్ల రాజాలు- రైస్ మిల్లులను ఇష్ట రాజ్యాంగ బెదిరిస్తూ తమ కావలసినంత దోచుకుంటున్న డీటీలు - లంచం తీసుకొని మరి విజిలెన్స్ కు పట్టించిన డీటీ పవన్ విజిలెన్స్ సిఐ శశికాంత్ కు సమాచారమిచ్చి కేసు చేయించిన డిటి పవన్ -శశికాంత్ కు పవన్ సమాచారమిచ్చిన సంభాషణ గుట్టురట్టు - ఇంత జరుగుతున్నా కనులుండి చూడలేని కబోదులుగా మారిన పౌర సంబంధాల శాఖ అధికారులు?**



నిజామాబాద్ ఆగస్టు 13: (ప్రజా గళం ప్రతినిధి) నిజామాబాద్ జిల్లాలో రైస్ మిల్లర్ పై జరుగుతున్న దాడీలు చేస్తున్న కేసులో వెనుక ఉన్న ఒకే ఒక అధికారి డిటి పవన్. తనకు తోచినంత తన నోటికి వచ్చినంత అమౌంట్ను దర్జాగా వసూలు చేస్తూ ఎవరైనా అడిగిన దానికంటే తక్కువ ఇస్తే వారిపై విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చి కేసులు చేయిస్తున్న డిటి పవన్. 1,20,000 రామ్ రాజ్ ఆగ్రో ఇండస్ట్రీస్ నుండి తీసుకొని విజిలెన్స్ సిఐ శశికాంత్ కు సమాచారమిచ్చి అతనితోపాటు ఇంకా వేరే రైస్ మిర్రర్లపై కూడా కేసులు చేయించిన ఘనుడు డిటి పవన్. ఒక్క చిన్న అధికారి అయ్యుండి ఇంత దర్జాగా వసూలు రాజాగా వసూలు చేస్తూ తన ఆస్తులను పెంచుకుంటూ ఎవరి కంట్లో పడకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్న సంబంధిత అధికారులకు తెలియట్లేదా తెలిసినా వారికి కూడా అందులో వాటాలు ఉన్నాయా అనే అనుమానాలు వస్తున్నాయని కొందరు రైస్ మిల్లర్లు ఆవేదనను వ్యక్తపరిచారు. గత ఫిబ్రవరి నెలలో రుద్రూర్ కు చెందిన ఆగ్రో ఇండస్ట్రీస్, రాహుల్ ట్రేడర్స్ పై దాడి చేయమని విజిలెన్స్ సిఐ శశికాంత్ కు చెప్పి పిలిపించి దాడి చేసి కేసులు పెట్టించినట్లు సమాచారం. గత ఫిబ్రవరి నెలలో రెండు రైస్ మిల్లకు సంబంధించి రెండు లక్షలకు ఒప్పందం చేసుకొని అందులో నుండి 1,20,000 తీసుకొని మిగతా 80000 ఇవ్వలేదని కసితో విజిలెన్స్ అధికారి సిఐ శశికాంత్ కి తప్పుడు సమాచారం ఇచ్చి కేసు చేయించి ఎవరికి తెలియనట్టు తప్పించుకు తిరుగుతున్నాడు. విజిలెన్స్ సిఐ శశికాంత్ కు డిటి లోపాయికారి ఒప్పందాలు పవన్ కు ఇద్దరి మధ్య ఏమైనా ఒప్పందాలు చేసుకొని ఈ దాడులు జరిగాయా అని అనుమానాలను కొందరు రైస్ మిల్లర్ యజమానులు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు. ఇంత జరుగుతున్న జిల్లా అదరపు కలెక్టర్, జిల్లా కలెక్టర్, డీఎస్ అధికారులు వారికి ఏమి తెలియనట్టు ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావట్లేదని కొందరు బాధితులు ఆవేదన వెల్లబుచ్చారు. తడిసిన వడ్లు మార్చెస్ ఎక్కువ ఉన్న వడ్లు తీసుకొని షార్ట్ ఏజ్ వచ్చిన అధికారులు ఆదేశించిన దూర ప్రాంతాలకు దూరమైన వారికి నష్టం కలిగిన వారు అన్న స్థలాలకు బియ్యాన్ని పెట్టి నష్టాలను భరించి సక్రమంగా ఉన్న కూడా లంచాలు తీసుకొని మరి కేసులు పెట్టి సతాయిస్తున్న డీటీ పవన్ పై జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులు సంబంధిత మంత్రి ఆ అధికారిపై చట్టపర్య చర్యలు తీసుకొని సంబంధిత బాధితులకు న్యాయం చేయాలని బాధిత రైస్ మిల్లర్ యజమానులు వారి కావేదనను సంబంధిత జిల్లా అధికారులకు విన్నపించుకున్నట్లు సమాచారం

# హిందూ, ముస్లింలు నా రెండు కళ్లు..

## కేవలం మాటల్లో కాదు చేతల్లో చూపించామన్న సీఎం రేవంత్..



**హైదరాబాద్,ఆగస్టు 13:** హైదరాబాద్ కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటివారని, మాటల్లో కాకుండా చేతల్లో సోనియా గాంధీ ఆ రీతిగా నిరూపించారని తెలిపారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేస్తూ, తెలంగాణలో అధికారంలోకి వస్తే ఆ రిజర్వేషన్లను తొలగిస్తామన్న అమిత్ షా సవాల్‌కు గుజరాత్‌లో ముందు తొలగించి చూపించాలని ఆరోపించామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేస్తోందని, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల్లో మైనారిటీ యువత మెరుగైన స్థానాలను సాధించారని స్పష్టం చేశారు. గతంలో గ్రూప్ 1 ప్రశ్నపత్రాలు పల్లీ బఠానీల్లా అమ్ముడయ్యాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత లేని వారిని నియమించారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యూపీఎస్సీని అధ్యయనం చేసి రిటైర్డ్ డీజీపీని చైర్మన్‌గా నియమించామని చెప్పారు. అభ్యర్థుల ఉద్యోగాల నియామకాన్ని అడ్డుకోవడానికి కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, మంచి అడ్వకేట్లతో పోరాడి అభ్యర్థుల తరఫున నిలబడి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మైనారిటీ సభ్యుడిని నియమించడమే కాకుండా, అజారుద్దీన్‌కు మంత్రి పదవి, నిఖత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగంతో పాటు రూ. 3 కోట్ల బహుమతి, మహమ్మద్ సిరాజ్‌కు నిబంధనలు సవరించి డీఎస్పీ ఉద్యోగాన్ని అందించామని వెల్లడించారు.

# నాందేడ్‌లో సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై కత్తులతో దాడి..



నాందేడ్, ఆగస్టు 13: శిరోమణి అకాలీదళ్‌అ ధినేత, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో దాడి జరిగింది. గురుద్వారాను సందర్శించి వస్తుండగా నగర శివార్లలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి అనంతరం బాదల్‌ను నాందేడ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్ తన భార్య, అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, కుటుంబ సభ్యులతో కలిసి నాందేడ్‌లోని ప్రసిద్ధ 'తఖ్త్ శ్రీ హజూర్ సాహిబ్' గురుద్వారాను సందర్శించారు. దర్శనం ముగించుకుని వస్తుండగా ఈ దాడి జరిగింది. బాదల్ తోపాటు, భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలయ్యాయి. దాడి వెనుక ఉన్న కారణాలు, దాడి చేసిన వారి సమాచారంపై పోలీసులు ప్రాథమిక విచారణ జరుపుతున్నారు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో

# సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,ఆగస్టు,13:**

న్యూఢిల్లీ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారించాలని అలహాబాద్ కోర్టు.. సీబీఐ, ఈడీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆగస్టు 17వ తేదీన చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్, జస్టిఓస్‌జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తులపై సీబీఐ ఇచ్చిన వివరణ పట్ల గతంలో అలహాబాద్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు చెందిన కొత్త అఫిడవిట్‌ను దాఖలుచేయాలని జూలై 20వ తేదీన లక్నో బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈడీ విచారణ సమయంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏవైనా డాక్యుమెంట్లు సేకరించారా అని కూడా హైకోర్టు ప్రశ్నించింది. కర్నాటక నివాసి ఎస్ విఘ్నేశ్ సిసిర్ దాఖలు చేసిన రిట్ పిటీషన్ ఆధారంగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు కూడా గతంలో విఘ్నేశ్ ఓపిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# అమెరికా కుట్ర? ఏకమౌతున్న ముస్లిం దేశాలు..!



**న్యూఢిల్లీ,ఆగస్టు 13:** ఒక రాత్రి ప్రపంచ పటం మీద కొన్ని గీతలు మెల్లగా కదిలాయి. మక్కా నగరంలో మూడు దేశాలు ఒకే గొడుగు కింద నిలబడ్డాయి. ఆ గొడుగు కింద డబ్బు ఉంది.. సైన్యం ఉంది.. ఆయుధాలు ఉన్నాయి.. అణుశక్తి ఉంది. కానీ ఆకాశంలో కనిపించని మరో విషయం ఉంది.. అదే భయం..! అమెరికా నీడలో దశాబ్దాలుగా నిద్రించిన మధ్యప్రాచ్యం.. ఇప్పుడు తనకంటూ ఒక కొత్త కవచాన్ని తయారు చేసుకుంటోందా? ఆ కవచం రేపు మరిన్ని దేశాలను తనలోకి లాగితే.. దాని నీడ ఎక్కడివరకు వెళ్తుంది? ఈ కథ మక్కాలో మొదలైంది కానీ దాని ప్రతిధ్వని భారత్ వరకు వినిపించే అవకాశం ఉందా? పాకిస్థాన్.. సౌదీ అరేబియా.. టర్కీ. మూడు దేశాలు. మూడు రకాల శక్తులు. సౌదీ దగ్గర అపారమైన ఆర్థిక బలం ఉంది. టర్కీ దగ్గర నాటో అనుభవంతో పెరిగిన సైనిక శక్తి, డ్రోన్లు, ఆయుధ తయారీ సామర్థ్యం ఉంది. పాకిస్థాన్ దగ్గర లక్షలాది సైనికులు.. వాటితో పాటు అణ్వాయుధ సామర్థ్యం ఉంది. ఈ మూడు శక్తులు ఒకే వలయంలోకి వచ్చినప్పుడు.. అది ఒక సాధారణ ఒప్పందంలా కనిపించినా, దాని వెనుక ఏర్పడే సమీకరణం మాత్రం చాలా పెద్దది. మక్కాలో కుదిరిన ఈ రక్షణ ఒప్పందం పరిధి ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. టర్కీ వైపు నుంచి ఇప్పటికే ఈ గొడుగు మరిన్ని దేశాలకు విస్తరించాలనే సంకేతాలు వచ్చాయి. మొదట ఈజిప్ట్ పేరు వినిపిస్తోంది. ఆ తర్వాత ఖతార్.. కువైట్.. జోర్డాన్.. అజర్‌బైజాన్.. సిరియా. ఒక్కో దేశం ఈ వలయంలోకి వస్తే.. మధ్యప్రాచ్య పటం మీద కొత్త సైనిక బంధం నెమ్మదిగా రూపం మార్చుకుంటుంది. ఇక్కడే ఈ కథలో అత్యంత భయపెట్టే విషయం దాగి ఉంది. ఈ ఒప్పందంలోని సూత్రం ప్రకారం.. ఒక సభ్యదేశంపై సాయుధ దాడి జరిగితే, అది మొత్తం కూటమిపై దాడిగా పరిగణించే విధానం ఉంటుంది. అంటే ఒక ప్రాంతంలో మొదలైన మంట.. మరో దేశ సరిహద్దు దాటడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. ఒక మిసైల్ ఒక దేశాన్ని తాకితే.. దాని ప్రతిస్పందన మరొక దేశం నుంచి రావచ్చు. ఆ తర్వాత ఇంకో దేశం కదలవచ్చు. ఇలా ఒకచిన్న చిచ్చు.. ఒక పెద్ద యుద్ధంగా మారే మార్గం అక్కడే మొదలవుతుంది. అయితే ఈ కూటమి పుట్టిన సమయం మరింత ఆసక్తికరం. ఇరాన్ దాడులతో మధ్యప్రాచ్యంలో అమెరికా భద్రతా వ్యవస్థపై ఉన్న నమ్మకానికి గట్టి దెబ్బ పడింది. అమెరికా రక్షణ వ్యవస్థలు ఎన్నో మిసైళ్లు, డ్రోన్లను అడ్డుకున్నా.. కొన్ని దాడులు సైనిక స్థావరాలు, ఇంధన కేంద్రాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను తాకాయి. గల్ఫ్ దేశాలకు ఒక భయంకరమైన నిజం అర్థమైంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యం తమ పక్కన ఉన్నా.. యుద్ధం మొదలైతే దాని మంటల నుంచి పూర్తిగా తప్పించుకోవడం అంత సులభం కాదు.

# హాఫీజ్ సయీద్‌కు నేను బానిస..

## భారత్‌కు పాకిస్థాన్ మాజీ మంత్రి బెదిరింపులు

### - ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌కు తాను బానిసనన్న పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్



**న్యూఢిల్లీ,ఆగస్టు,13:**

పాకిస్థాన్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముంబై ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా(ఎల్‌ఈటీ) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు తాను 'గులాం'ను (బానిసను) అని ఆయన బహిరంగంగా ప్రకటించారు. లష్కరే తోయిబా కీలక నేతలతో వేదికను పంచుకుంటూనే, భారత్‌ను ఉద్దేశించి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతంసోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక బహిరంగ సభలో ప్రసంగించిన షేక్ రషీద్,"నేను హాఫీజ్ సాహెబ్‌కు బానిసను" అని వ్యాఖ్యానించారు. తన మొబైల్ ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నంబర్ ఉన్నందునే అమెరికా తనపై నిషేధం విధించిందని ఆయన పేర్కొన్నారు. లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ ఖలీద్ మసూద్ సంధు, సలహా కమిటీ సభ్యుడు కారీమహ్మద్ యాకూబ్ షేక్‌లతో కలిసి ఆయన వేదికపై కనిపించడం గమనార్హం.

# ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి'


## రాజ్యసభలో రగడ



న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని రామ్‌లీలా మైదాన్‌లో తాను పాల్గొన్న స్టేజ్‌ను బీజేపీ శుద్ధి చేసిన అంశాన్ని విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గేఇవాళ రాజ్యసభలో ప్రస్తావించారు. ఆ మైదానంలో ఓ కార్యక్రమంలో పాల్గొని ఖర్గే ప్రసంగించారు. అయితే ఆయన వెళ్లిన తర్వాత అక్కడ స్టేజ్‌ను శుద్ధి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశాన్ని రాజ్యసభలో ప్రస్తావిస్తూ.. అంటరానితనం చట్టం కింద వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హల్ద్వానిలో స్టేజ్‌ను శుద్ధీకరించిన వారిని శిక్షించాలన్నారు. వాళ్లను అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా ఆ చర్యను ఖండించారని ఖర్గే తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఖర్గే మాట్లాడుతున్న సమయంలో సభలో గందరగోళం నెలకొన్నది. ఇలాంటి కార్యక్రమాలను బీజేపీ ప్రోత్సహించదు అని, ఆ ఘటన పట్ల దర్యాప్తు చేపడుతామని మంత్రి జేపీ నడ్డా అన్నారు. హల్ద్వానీలో తాను ప్రసంగం చేసిన స్టేజ్‌ను బీజేపీ సంబంధిత వ్యక్తులు శుద్ధి చేశారని ఖర్గే తన ప్రసంగంలో ఆరోపించారు. ఆ సభలో తాను కేవలం ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడానని, తానేమీ మతం గురించి కానీ, ఇతర అంశాల గురించి కానీ మాట్లాడలేదన్నారు. ఆ సభా ప్రాంగణంలో హవనం, శుద్ధి ప్రక్రియ నిర్వహించారని, ప్రజాస్వామ్యం ఇలాగే పనిచేస్తుందా, రాజ్యాంగాన్ని మీరు రక్షిస్తున్నారాన అని ఖర్గే ప్రశ్నించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయదలుచుకోలేదని, స్టేజ్‌ను శుద్ధి చేసి తనను అవమానించారని ఆయన అన్నారు.

## ఆర్జీ కర్ బాధితురాలి మృతదేహం హడావుడి దహనం

# టీఎంసీ మాజీ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్ అరెస్ట్



**కోల్‌కత్తా,ఆగస్టు,13:**

కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దారుణ అత్యాచారం,హత్య ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి మృతదేహాన్ని హడావుడిగా దహనం చేశారనే తీవ్ర ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్‌ను పోలీసులు ఒడిశాలోని సంబల్‌పూర్‌లో అరెస్టు చేశారు. రెండవ పోస్ట్‌మార్టం జరగకుండా అడ్డుకోవడానికే, సాక్ష్యాధారాలను తుడిచిపెట్టే కుట్రలో భాగంగా కుటుంబ సభ్యుల ముందస్తు అనుమతి, సంతకాలు లేకుండానే నిర్మల్ ఘోష్‌అండ్ టీమ్ దహన సంస్కారాలు పూర్తిచేయించారని బాధితురాలి తండ్రి ఖర్దా పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఫిర్యాదు చేశారు.

# సంపాదకీయం

## అన్ని వివక్షలనూ తొలగించేలా వుండాలి

ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షను అరికట్టేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి) జనవరి 13న 'ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక నియమావళి-2026? (హెచ్.ఇ.ఐ.ఎస్) మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రధాన ఉద్దేశం మతం, జాతి, లింగం, జన్మస్థలం, వైకల్యం ఆధారంగా వివక్ష లేకుండా చూడటం. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక బలహీన వర్గాల పట్ల వివక్షను, కుల ఆధారిత వివక్షను నిలువరించడం దీని లక్ష్యం. వివక్షకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం జరిగిన పోరాటాలవల్ల ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి. అంతేగాని, ఇవేవీ బహుమతిగా వచ్చి పడినవి కాదు. ఈ మార్గదర్శకాలు పెద్ద చర్చకే దారితీశాయి. ఉన్నత వర్గాలవారు తీవ్రంగా నష్టపోతారని కొందరు?' ఇప్పటికే 2012 మార్గదర్శకాల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి సెల్స్ ఉన్నాయి. మరి ఈ నూతన నిబంధనలు ఎందుకని?' మరికొందరు వాదిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ సిటీ మేజిస్ట్రేట్ అధికారి అలంకార్ అగ్నిహోత్రి ఏకంగా తన పదవికే రాజీనామా చేశారు. పలు సవరణలు చేయాలని కొందరు కోరుతున్నారు. అసలు ఈ మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయి? నిజంగా వీటి ద్వారా విద్యాసంస్థల్లో వివక్షను పోగొట్టగలమా? వీటి అమలు ఎలా ఉండబోతోంది? మరోవైపు సుప్రీంకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలైంది. వాదనలు విన్న కోర్టు స్టే విధించింది. దీనితో నూతన మార్గదర్శకాలలో ఎటువంటి మార్పులు జరుగుతాయనేది పెద్ద ప్రశ్నగానే మారింద్ని. దేశంలో వివక్ష ఈ నాటిది కాదు. కులం పేరుతో, జాతి పేరుతో, లింగం పేరుతో వందల ఏళ్ళగా వివక్ష కొనసాగుతున్నది. వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే నమ్మగలమా? కానీ ఇది అక్షర సత్యం. పుట్టుకనే ఒక "ఘోర ప్రమాదం"గా అభివర్ణించి వారిని ఆత్మహత్య చేసుకునే విధంగా పురికొల్పుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేములపై ఇటువంటి దారుణమే జరిగింది. ముంబై లోని బివైఎల్ నాయర్ హాస్పిటల్‌లో పి.జి వైద్య విద్యార్థిని పాయల్ తాడ్వి గిరిజన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అవడంతో తోటి డాక్టర్ల వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. దర్శన్ సోలంకి కూడా బలవన్మరణానికి పాల్పడ్డారు. సోలంకి 2023 ఐఐటి బాంబేలో మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థి. తన కులం తెలిసిన తర్వాత తోటి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని, వివక్ష ఎదురవుతోందని కుటుంబ సభ్యులతో వాపోయిన కొద్దిరోజులకే ఆత్మహత్య చేసుకున్నారనే అంశాలకు కోర్టు విస్తుపోయింది. నూతన ఆలోచనలకు కేంద్రాలుగా ఉండాల్సిన విద్యాసంస్థలు కుల వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం చేదు నిజం. ఇలాంటి కేసులపై కోర్టులు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా యుజిసి మార్గదర్శకాలు తయారు చేసింది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2014 నుండి 2021 మధ్య కాలంలో ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యాసంస్థల్లో 122 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, వారిలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి సామాజిక వర్గాలకు చెందినవారే ఉన్నారు. యుజిసి గణాంకాల ప్రకారం ఈ దశాబ్ద కాలంలో కుల వివక్ష ఫిర్యాదులు 118 శాతం పెరిగాయి. విద్యార్థుల నమోదులో 14 శాతం ఎస్‌సి వర్గాల విద్యార్థులు ఉంటే, అధ్యాపక వృత్తి వచ్చేసరికి కేవలం 6 శాతానికి పడిపోతోందని అఖిల భారత ఉన్నత విద్యా సర్వే-2025 (ఎ.ఐ.ఎస్.హెచ్.ఇ) గణాంకాలు చెబుతున్నాయి. 2012 మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే అనేక కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి సెల్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలు, గ్రీవెన్స్ పోర్టళ్లు ఉన్నాయి. అయినప్పటికీ ఇన్ని వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వాటి అమలు అసంబద్ధంగా ఉండమే ఇందుకు ప్రధాన కారణం. యూనివర్సిటీలు, కాలేజీల్లో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అండగా ఉండటమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని ఇప్పటికే యుజిసి స్పష్టం చేసింది. అయితే దీని ప్రకారం దేశంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో 'ఈక్వల్ ఆపర్చునిటీ సెంటర్' (ఇ.ఒ.సి) ఏర్పాటు చేయడం తప్పనిసరి. వివక్షపై ఫిర్యాదులకు 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. విచారణ గడువు లోపల ముగించాలి. దోషులుగా తేలితే శిక్షలు కఠినంగా అమలు చేయాలి. అవసరమైతే సంస్థలకు గుర్తింపు రద్దు చేయాలి. లేదా నిధులను ఆపేయాలి. దీనిలో ముఖ్యమైనది ఈ సెంటర్లలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, మహిళలు, వికలాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. 2012 నాటి నిబంధనల మాదిరిగా కాకుండా?నూతన నిబంధనలను ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేయాలి. ఐఐటి, ఐఐఎం, ఎయిమ్స్ లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో అమలు జరిగేలా అవసరమైన మార్పులు చేయాలి. ఈక్విటీ ఆపర్చునిటీ సెల్స్ విభాగాలు వర్సిటీల వైస్ ఛాన్సలర్ల అధీనంలో కాకుండా?నిష్పాక్షిక ప్రతినిధులతో ఉండాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయ పరిపాలనతో సంబంధం లేని ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి ప్రతినిధులు మెజారిటీగా ఉండే ఒక స్వతంత్ర చట్టబద్ధమైన కమిటీ ఉండాలి. విద్యార్థి ప్రతినిధులను 'మెరిట్' ఆధారంగా నామినేట్ చేయకుండా ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలి. దోషుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. దేశ్‌పాండే కమిటీ సిఫార్సు చేసినట్లుగా ఆరోపణను నిరూపించాల్సిన బాధ్యతను సంస్థలపైనే ఉంచాలి. యుజిసి సలహా కమిటీకి మించి స్వయంగా విచారణ చేపట్టే అధికారాలు సుమోటో కలిగిన జాతీయ పర్యవేక్షణ కమిషన్ ఉండాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళు గడుస్తున్నా కులం పేరుతో వివక్ష కొనసాగుతుండం దారుణం. సంఘ్? పరివార్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలను రుద్దుతూ సమాజాన్ని కులాల వారీగా విభజిస్తోంది. అంతటి వివక్షను రూపుమాపేందుకు మొదటి అడుగు వేస్తూనే దుర్వినియోగం అవుతాయనే సాకు చెప్పి మార్గదర్శకాలు రద్దు చేయాలని అనేక ఆందోళనలు చేయడం సిగ్గుచేటు. దీనికి స్వయంగా బిజెపి నాయకులు నిరసనకారులకు మద్దతు తెలియజేయడం వారి అసలు ఉద్దేశాన్ని తెలుపుతున్నది.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# బ్రిటిష్ పాలకుల సింహస్వప్నం...!


లాలా లజపతిరాయ్ జీవితం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయి. ఆనాటి భారతీయులను ఎందరినో ఆయన భావాలు, త్యాగాలు ప్రభావితం చేశాయి. ఆయన పిలుపు దేశ ప్రజల గుండెలలో మారుమోగి, లక్షలాది మంది భారతీయులు స్వాతంత్ర్య ఉద్యమంలోకి దిగి, ఆ మహా యజ్ఞంలో సమిధలు కావడానికి ప్రేరణ కలిగించింది. కోట్లాది ప్రజలకు ఆరాధ్య దేవునిగా లాలాజీ పూజలు అందుకున్నారనడంలో అతిశయోక్తి లేదు. 'నేను మరణించవచ్చు, కాని నానుండి వెలువడే ప్రతి నెత్తురు చుక్క నుండి లక్షలాది స్వాతంత్ర్య సమరయోధులు ఉద్భవిస్తారు' అని ప్రకటించారు. లాలా మాట నిజం అయింది. అయన మరణానంతరం స్వాతంత్ర్యోద్యమం మరింతగా విస్తృతం అవుతుందని తెలిసిన భవిష్యత్ దర్శకుని జీవితం భారతీయులకు స్ఫూర్తిదాయకం. స్వదేశీ ఉద్యమం, ఆర్య సమాజాన్ని, అతివాద రాజకీయాలను సమన్వయ పరచిన భారత జాతీయ అగ్ర నాయకులలో లాలా లజపతిరాయ్ ఒకరు. ఒకే భావాలు కలిగిన స్వాతంత్ర్య సమర యోధులైన లాలా లజపత్ రాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ లను "లాల్ బాల్ పాల్" అని పిలిచేవారు.లాలా లజపత్ రాయ్ (జనవరి 28, 1865 - నవంబరు17, 1928) పంజాబ్ రాష్ట్రం మోఘా జిల్లా ధుడీకె గ్రామంలో జన్మించారు. భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరులలో ఒకరిగా చిరస్థాయిగా నిలిచి పోయారు. ఆయన "పంజాబ్ కేసరి" బిరుదాంచితులు అయినారు. అయన పంజాబ్ నేషనల్ బ్యాంకు, లక్ష్మి ఇన్సూరెన్స్ కంపెనీల స్థాపకుడు. లాహోర్‌లో న్యాయవిద్య అభ్యసిస్తున్నప్పుడు స్వాతంత్ర్యోద్యమం వైపు దృష్టి సారించారు. అదే సమయంలో స్వామి దయానంద సరస్వతి భావాలవైపు మొగ్గు చూపారు. 1877లో లాగోర్ ఆర్యసమాజ్ సభ్యుడిగా ఉంటూనే ఆర్య గెజిట్‌కు సంపాదకత్వం వహించారు. 1888, 1889 లలో జరిగిన జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాలలో ఆయన ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆ తర్వాత 1892లో హైకోర్టులో న్యాయవాదిగా లాహోర్ కు వెళ్లారు. 1885వ సంవత్సరంలో ఒక ప్రభుత్వ కళాశాల నుండి రెండవ తరగతి న్యాయవాద పరీక్షలో ఉత్తీర్ణులై హిస్సార్ లో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. ఆ తర్వాత 1892లో లాహోర్ కు మకాం మార్చారు. భారత జాతీయ కాంగ్రెస్ లోని ప్రముఖ నాయకులలో లాలా లజపతిరాయ్ ఒకరిగా గుర్తింపు పొందారు. 'స్వేచ్ఛ అనేది అభ్యర్థించడం నుంచి రాదు, కానీ అది పోరాడాలి' అనే బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్ ల అభిప్రాయాలతో ఆయన ఏకీభవించారు. అలా భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించి 1920లో కలకత్తాలో జరిగిన ప్రత్యేక సమావేశానికి అధ్యక్షులుగా ఎన్నికైనారు. 1921లో "సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటి" పేరుతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. జాతీయోద్యమంలో "పంజాబ్ కేసరి"గా పేరు పొందారు. "ఆర్య సమాజం నా తల్లి, వైదిక ధర్మం నా తండ్రి" అంటుండే వారు ఆయన. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో లాలా కూడా పాల్గొన్నారని, ఆయనతో పాటు సురేంద్ర నాథ్ బెనర్జీ, బిపిన్ చంద్ర పాల్, అరవింద్ ఘోష్ లతో కలిసి బెంగాల్ తదితర ప్రాంతాల్లో ప్రజలను ఏకం చేసి స్వదేశీ ఉద్యమాన్ని ఉధృతం చేశారని చరిత్ర చేపుతున్నది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఆయన తన పూర్తి శక్తిని వినియోగించారు. చివరికి న్యాయవాద వృత్తిని కూడా వదులు కున్నారు.

# జీహెచ్ఎంసీ విస్తరణతో.. రెవెన్యూ చట్టాలపై ప్రభావం




ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్‌ని ఓఆర్ఆర్‌కు ఇవతల, అవతల ఉన్న వాటిని జీహెచ్ఎంసీలో కలుపుతూ, అసెంబ్లీ, గవర్నర్ ఆమోదంతో బిల్లు చట్టంగా మారింది. ఇందులో అత్యధిక విలువ గల భూములున్న 7 మున్సిపల్ కార్పొరేషన్స్ అయిన బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, పీర్జాదీగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్.. 20 మున్సిపాలిటీలు అయిన ఆదిబట్ల, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగి, పెద్ద అంబర్ పేట్, తుక్కుగూడ, మేడ్చేల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూకుంట, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్‌లు ఉన్నాయి. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర పనులకు వినియోగించాలంటే దానికి కన్వర్షన్ ట్యాక్స్ కట్టాలి.. గతంలో అయితే నాలా చట్టం 1963, భూమి వినియోగాన్ని బట్టి అంటే, రెసిడెన్షియల్, ఇండస్ట్రీస్, కమర్షియల్ ట్యాక్స్ ప్రతీ సంవత్సరం వసూల్ చేసేవారు.. దానికి బదులుగా వన్ టైం ట్యాక్స్‌గా నాలా చట్టం-2006 రూపొందించడం, దాని ప్రకారం, వ్యవసాయ భూములను ఇతర వ్యవసాయేతరానికి వినియోగించాలంటే దానిని కన్వర్షన్ చేసుకోవడం తప్పనిసరి. దానికి చట్టం వచ్చిన మొదట్లో బేసిక్ వ్యాల్యూకు 9 శాతం కన్వర్షన్ ట్యాక్స్ వసూల్ చేసేవారు.. అందుకు చట్ట ప్రకారం సంబంధిత రెవెన్యూ డివిజినల్ అధికారికి కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేసేవారు. తర్వాత 9 శాతం నుండి 3 శాతానికి కుదించడం జరిగింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జీవో నెం 147 తేదీ: 16/12/2020 నాడు చట్టంలో సెక్షన్ 4(1)కు కన్వర్షన్ ట్యాక్స్‌కు అమెండ్‌మెంట్ చేశారు.. దాని ప్రకారం, ఒకవేళ వ్యవసాయ భూములు జీహెచ్ఎంసీ పరిధిని దాటి ఉన్న భూములకు బేసిక్ వ్యాల్యూలో 3 శాతం ట్యాక్స్‌ని ఫిక్స్ చేయడం, మళ్లీ గత సంవత్సరం ఆగస్ట్ 2025లో పై ట్యాక్స్‌ని జీహెచ్ఎంసీ పరిధిలోని వాటికి 3 శాతంగాను, జీహెచ్ఎంసీ పరిధిని దాటి ఉన్న వాటికి 5-6 శాతం బేసిక్ వ్యాల్యూ ట్యాక్స్‌గా నిర్ణయించడం, అలాగే యాక్ట్ 19/2021 ద్వారా కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఆర్‌డీఓల నుండి తాహసీల్దార్‌లకు బదలాయించడం ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా తాహసీల్దార్‌లు నిర్ణయించిన ఫీజుల ప్రకారం కన్వర్షన్ ప్రోగ్రెస్‌ను జారీ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించడం ద్వారా ఎంతో విలువైన, రియల్ ఎస్టేట్ బూమ్ కలిగిన 27 ఙఃః (అర్బన్ లోకల్ బాడీ)ల వ్యవసాయ భూములను కన్వర్షన్ చేయాలంటే దాని ట్యాక్స్‌ని 5 శాతం నుండి 3 శాతంకు తగ్గించడం ద్వారా రాష్ట్ర ఖజానాపై ప్రభావం పడుతుంది. అంతేగాక ప్రస్తుతం ధరణి తర్వాత భూ భారతి చట్ట ప్రకారం జాయింట్ రిజిస్ట్రార్ లాగా తాహసీల్దార్‌లు ఉన్నారు. రిజిస్ట్రేషన్ చట్టం-1908 ప్రకారం, డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చెయ్యడంలో చట్ట ప్రకారం వసూలు చేయాల్సిన స్టాంప్ డ్యూటీలో పోర్టల్ అవకతవకలు జరిపే రాష్ట్ర ఖజానాకు కొన్ని వందల కోట్ల రూపాయలకు గండి కొట్టారని ఆరోపణలు వచ్చాయి.. దానిపై విచారణ జరుపుతారన్న సమయంలో ప్రస్తుతం తాహసీల్దార్‌లు అగ్రికల్చర్ నుండి నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్‌తో కూడా సరైన ట్యాక్స్ వసూల్ చేశారా లేదా? అన్నది కూడా ఆడిట్ చేయవలసి ఉన్నది. ఎందుకంటే గత జీహెచ్ఎంసీ పరిధిలో వ్యవసాయ భూముల విస్తీర్ణం తక్కువ ప్రస్తుతం విలీనం అయిన 27 అర్బన్ లోకల్ బాడీలలో వ్యవసాయ భూముల విస్తీర్ణం ఎక్కువ కాకుండా అధిక ధరలు గల్లి ఉండి, రియల్ ఎస్టేట్ అనేది ప్రాంతాలలో ఎక్కువ ఉండటం, ఒక దిక్కు ట్యాక్స్ గతం తక్కువ కావడం దానిపై సరైన ఆడిట్ లేకపోవడం, తహసీల్దార్‌లు కూడా అసలు చట్ట ప్రకారం ట్యాక్స్ కట్టారా? లేదా అన్నది ఎంక్వైరీ చెయ్యకపోవడం లాంటి సంఘటనల వలన వాటిపై కూడా రాష్ట్ర ప్రభుత్వం తగు దృష్టి పెట్టవలసి ఉన్నది. ఇకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం సెక్షన్-3 (7) ప్రకారం నోటిఫైడ్ అయిన అర్బన్ ఏరియాతో వ్యవసాయేతర భూములకు 'భూ భారతి' చట్టం వర్తించదని స్పష్టంగా చెప్పింది.

# బడ్జెట్ కూర్పులో సాటిలేని మేటి కొణిజేటి...




ఆయన సీనియర్ రాజకీయ నాయకుడు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వివిధ కీలక శాఖల మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళ నాడు గవర్నర్ గా విధులు నిర్వర్తించిన అరుదైన అవకాశాలు పొందిన రాజకీయ దురంధరుడు. బడ్జెట్ తయారీ స్పెషలిస్టుగా, తన వాగ్ధాటితో శాసన సభ్యులను, మండలి సభ్యులను ఆకట్టుకున్న ప్రత్యేక శైలిని కలిగి ఉన్న ఘనుడు. విపక్షాలకు శాసనసభలో, మండలిలో ధీటైన సమాధానాలు చెప్పి ఒప్పించిన చతురుడు. 15సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన అరుదైన గౌరవం పొందిన మంత్రి. ఆయనే కొణిజేటి రోశయ్య. ఆచార్య ఎన్జీరంగా శిష్యుడిగా రాజకీయ రంగప్రవేశం చేసిన రోశయ్య అనేక పదవులు నిర్వహించారు. ఎమ్మెల్యేగా.. ఎమ్మెల్సీగా.. ఎంపీగా చట్ట సభల్లో సుదీర్ఘ కాలం పని చేసిన ఘనత ఆయనకే దక్కింది. 1968-85: శాసనమండలి సభ్యుడుగాబీ 1978-79: శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా, 1979-83: రాష్ట్ర మంత్రిగా, 1985-89: తెనాలి శాసన సభ్యునిగా, 1989-94: మంత్రిగా, 2004-09: చీరాల శాసన సభ్యునిగా, 2004 : మంత్రిగా, 2009 : రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా, 2009, సెప్టెంబరు - 2010 నవంబరు 24: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 3 సెప్టెంబరు 2009 - 25 జూన్ 2011 వరకు, కర్ణాటక గవర్నర్‌గా 28 జూన్ 2014 - 31 ఆగస్టు 2014 వరకు, తమిళనాడు గవర్నర్ గా 31 ఆగస్టు 2011 - 30 ఆగస్టు 2016 వరకు పని చేశారు. వివిధ పదవులు అనుభవించిన, సమర్థ వంతంగా నిర్వహించిన సుధీర్ఘ రాజకీయ అనుభవ శాలి రోశయ్య. 1933, జూలై 4న గుంటూరు

జిల్లా వేమూరు గ్రామములో జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రోశయ్య విద్యార్థి దశలోనే ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసారు. ఆయన 1968,1974, 1980,2009 లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1979లో టంగుటూరి అంజయ్య ప్రభుత్వంలో రవాణ, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖలు, 1982లో కోట్ల విజయ భాస్కరరెడ్డి ప్రభుత్వంలో హెూం శాఖ, 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, రవాణ, విద్యుత్తు శాఖలు, 1991లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలు, 1992లో కోట్ల విజయ భాస్కర రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలకు మంత్రిగా పనిచేసారు. 1994 నుంచి 1996 వరకు ఆయన పీసీసీ అధ్యక్షుడిగా పని చేసారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

2004, 2009లో వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వములో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ (ఆర్థిక ప్రణాళిక)ను ఇప్పటికి 15 సార్లు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో సుదీర్ఘకాలం పాటు ఆర్థికమంత్రిగా పనిచేసిన రోశయ్య 2009-10 బడ్జెటుతో కలిపి మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెటును ప్రవేశ పెట్టారు. ఇందులో చివరి 7 సార్లు వరుసగా ప్రవేశ పెట్టడం విశేషం. అలా బడ్జెట్ కూర్పులో రోశయ్య సాటిలేని మేటి గా పేరు పొందారు. ముఖ్యమంత్రిగా

వై.ఎస్. రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో 2009, సెప్టెంబర్ 3 న రోశయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. పద్నాలుగు నెలలు అధికారంలో కొనసాగిన అనంతరం 2010 నవంబరు 24 వ తేదీన తన పదవికి రాజీనామా చేసారు . 2011 ఆగస్టు 31న రోశయ్య తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా ప్రమాణ స్వీకారం చేశారు. 2016 ఆగస్టు 30 వరకూ గవర్నరుగా తన సేవలు అందించారు. 2007లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. 2018 ఫిబ్రవరి 11 నాడు టి.సుబ్బి రామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో

ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను గజమాలతో సత్కరించి జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు... రోశయ్యకు స్వర్ణ కంకణం బహుకరించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రోశయ్య (88) గత సంవత్సరం డిసెంబర్ 4న ఉదయం రక్త పోటు తగ్గి, ఆస్పత్రికి తరలించ బడి, మార్గమధ్యలోనే మృతి చెందారు. రోశయ్య తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారు.

# ఏఐ సాయంతో తొలిసారిగా టీకా అభివృద్ధి




కొవిడ్-19 రాకముందే దానికి టీకా అందుబాటులో ఉంటే? ప్రపంచవ్యాప్తంగా లాక్‌డౌన్లు, ప్రాణ నష్టం తప్పేవి కదా. కానీ కొత్త మహమ్మారులు పురుడు పోసుకోకముందే వాటికి కారణమయ్యే వైరస్‌లను ఊహించేదెలా? టీకాలు రూపొందించేదెలా? వైరస్ స్వభావాన్ని తెలుసుకోకుండా వ్యాక్సిన్ రూపకల్పన అసాధ్యం! కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన జొనాథన్ హీనీ నేతృత్వంలోని బృందం.. ఈ లోటును అధిగమించింది. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సరికొత్త టీకా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఇది ఆ తరగతికి సంబంధించిన అన్ని వైరస్ రకాలనూ ఎదుర్కొనే రోగనిరోధక శక్తిని సంతరింపజేస్తుండటం, మున్ముందు మారిపోయే వైరస్ రకాల నుంచీ రక్షణ కల్పిస్తుండటం విశేషం. అదీ ఒకే ఒక్క ఇంజెక్షన్‌తో! అందుకే దీన్ని భవిష్యత్ మహమ్మారుల పాలిట బ్రహ్మాస్త్రంగా అభివర్ణిస్తున్నారు. ఎలా పని చేస్తుంది? సాధారణంగా టీకాలను ప్రస్తుత వైరస్ రకాలను ఉపయోగించుకొని తయారుచేస్తుంటారు. కేంబ్రిడ్జి పరిశోధకులు మాత్రం కొవిడ్ పరిశీలన కార్యక్రమాల్లో సేకరించిన రకరకాల కరోనా వైరస్‌ల జన్యు సంకేతాలను ఏఐ సాయంతో విశ్లేషించారు. వైరస్‌లు మనుగడ సాగించటానికి తోడ్పడుతున్న కీలక అంశాలను నిర్దిష్టంగా గుర్తించారు. వీటన్నింటి ఆధారంగా ఒక 'సూపర్ యాంటీజెన్'ను రూపొందించారు. దీనితో సార్బెకో కరోనావైరస్ టీకాను తయారుచేశారు. ఆ వైరస్ తరగతికి సంబంధించిన అన్ని రకాలను ఎదుర్కొనేలా మానవ రోగనిరోధక వ్యవస్థకు శిక్షణ ఇవ్వటం దీని ప్రత్యేకత. వైరస్ మార్పునకు లోనైనా, జంతువుల నుంచి మనుషులకు కొత్తగా ఇన్‌ఫెక్షన్ సోకినా కూడా రక్షణ కల్పిస్తుంది. సూపర్ యాంటీజెన్ భావన.. టీకా తయారీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే కేంబ్రిడ్జి పరిశోధకులు సార్వత్రిక ఫ్లూ, బర్డ్ ఫ్లూ టీకాలపై జంతు ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. మెదడులో రక్తస్రావానికి కారణమయ్యే ఎబోలా వంటి వైరస్‌లకూ టీకాలు రూపొందించటం మీద దృష్టి సారించారు. ప్రయోగ పరీక్షలో సురక్షితంగా సార్బెకో కరోనావైరస్ టీకాను ఆరోగ్యవంతులైన 49 మందిపై పరీక్షించారు. దీన్ని సూక్ష్మ ద్రవ ప్రవాహం ద్వారా డీఎన్‌ఏ టీకా రూపంలో ఇచ్చారు. ఇదో సూది రహిత విధానం. అధిక పీడనంతో, వెంట్రుకంత సన్నటి ద్రవ ప్రవాహంతో టీకాను నేరుగా చర్మ కణాల్లోకి ప్రవేశపెట్టటం దీని ప్రత్యేకత. సూది గుచ్చుకుంటుందనే భయం ఉండదు.

# నేరాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## - డయల్ 112 గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి
## - సమీక్ష సమావేశంలో సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 13 (ప్రజాగళం )**నేరాలను నియంత్రించడంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు ఆర్మూర్ డివిజన్ కు సంబంధించి నేరాల నియంత్రణ పై సమీక్ష సమావేశం గురువారం నందిపేట్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ,రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని , అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని , ఆన్లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు , రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు , మహిళలపై నేరాలు , సైబర్ మోసాలు , డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా , పేకాట , గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు , పాత నేరస్తులు , బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , షీ టీమ్స్ , ఈగల్ టీమ్స్ , చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు, జనసంచారం ఎక్కువగా ఉ ండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. పేకాట , గుట్కా , ఇసుక, ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ , రికార్డుల నిర్వహణ , స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి , నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి , సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం



, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే, స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని , ఓవర్ స్పీడ్ , త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలన్నారు. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని , వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీసీఆర్ బి ఏసీపీ గురునాయుడు , సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , సీ.ఐ లు, ఎస్సై లు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, పంద్రాగస్టు వేడుక ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

**నిజామాబాద్, ఆగస్టు 13 ( ప్రజాగళం ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 15న సంగారెడ్డిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుండగా, జిల్లా స్థాయిలో నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సలహాదారులు, ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్దిదారులు హాజరు కానున్న దృష్ట్యా, పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలని, ప్రోటోకాల్ ను అనుసరిస్తూ ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా గందరగోళానికి తావు లేకుండా ముందస్తుగానే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ అరేంజ్మెంట్, పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చక్కబెట్టుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు పురమాయించారు. అలాగే, ఈ నెల 15న ఉదయం వేళలో పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సత్కరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వీలుగా సీటింగ్ అరేంజ్మెంట్ చేయాలని అన్నారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం,




మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగ రావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి
## - సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ



**నిజామాబాద్ వైద్య విభాగం ఆగస్టు 13( ప్రజాగళం)** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, జీవనశైలి వ్యాధులు , క్షయ వ్యాధి,వ్యాధి నిరోధక టీకాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. రాజశ్రీ గురు‌వారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాల పరిశుభ్రత, నీటి ట్యాంకులను వారానికోసారి తప్పకుండా శుభ్రం చేస్తూ ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్ కలిసిన క్లోరినేషన్ వాటర్ ని తాగాలని, నీటి నిల్వలను తొలగించాలని, కాలి ప్లాట్లు, మురికినీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ ను వదలాలని, డెంగీ వ్యాధి వచ్చిన ఇంటి చుట్టూ 50 ఇళ్లలో పైరత్నం స్ప్రే చేయాలని, 100 ఇళ్ల వరకు టెమిఫాస్ స్ప్రే చేయాలనీ, ఇంటింటికి జర సర్వేను నిర్వహించి, ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతిరోజు రక్త పరీక్షలను నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ స్ప్రేను, ఫాగింగ్ ను నిర్వహించాలన్నారు. డెంగీ సోకిన వారి దగ్గర అసలు ద్రవ ఆహారాలను తరచుగా తీసుకోవాలని, పారాసెటమాల్ మాత్రలు వేసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలన్నారు, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో పాఠశాలలో, కళాశాలలో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. నీటి కాలుష్యం వల్ల వ్యాపించే వ్యాధులను నీటి పరీక్ష కిట్లను ఉపయోగించి నీటి నాణ్యతను పరీక్షించాలన్నారు. తద్వారా టైఫాయిలు డయేరియా అతిసారా కలరా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పడాలన్నారు, క్షయ వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించే క్షయ నిర్ధారణ పరీక్షలను ప్రజలు వినియోగించుకోనేలా చూడాలని, క్షయ వ్యాధిగ్రస్తులు 6 నెలల చికిత్స కోర్సును వాడాలన్నారు, జీవనశైలి వ్యాధుల్లో భాగంగా 30 సంవత్సరాల పైబడిన వారిని హైపర్ టెన్షన్ మధుమేహం క్యాన్సర్ కోసం నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి అన్నారు, పరీక్షల కోసం పెండింగ్లో ఉన్న వారందరినీ పరీక్షించి ఎమ్మా లాగిన్ లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే చికిత్స తీసుకుంటున్న వారందరినీ లైన్ లిస్టు ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా నియంత్రించే వ్యాధులను టీకాలు తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చు అన్నారు. అనుమానిత కేసులైన ఏ ఎఫ్ పి, మీజిల్స్ శాంపుల్స్ ను సేకరించి పంపించాలన్నారు, ఈ సమీక్ష సమావేశంలో డిటిసి ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, పి ఓ డి టి డాక్టర్ అంజన, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, డిస్టిక్ ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, హెచ్ఈఈవో జహీద్ ఆఫీస్, డిప్యూటీ డెమో దుర్గారావు, డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు వివిధ పీహెచ్సీల సిహెచ్ ఓలు, హెచ్ ఈ లు, హెచ్ ఇ ఓ లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

## - రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి - కలెక్టర్ భవేష్ మిశ్రా
## - డంపింగ్ యార్డు సందర్శన

**నిజామాబాద్, ఆగస్టు 13 ( ప్రజా గళం ప్రతినిధి )**ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు.



తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా, నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

# వేతనాలు రాక దినసరి కూలీల గోస

## -వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు
## -మద్దతు ప్రకటించిన ఆర్.పి.ఐ పార్టీ

**నిజామాబాద్ సిటీ , ఆగష్టు 13( ప్రజా గళం )** ఆసియా ఖండంలోని ప్రఖ్యాతిగాంచిన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ లో పనిచేస్తున్న దినసరి కూలీలు మూడు నెలలుగా జీతాలు రాక దీనస్థితిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నిరాహార దీక్షలకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నీరడి లక్ష్మణ్ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒంటెద్దు పోకడలతో దినసరి కూలీలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఆర్పిఐ పార్టీ పక్షాన మా ప్రతినిధులు వెళ్లి బకాయిల విషయమై చైర్మన్ ను నీలదియగా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. దినసరి కూలీల సమస్యలపై ప్రజాగళం మార్కెట్ యార్డ్ చైర్మన్ ముప్పగంగారెడ్డిని వివరణ కోరగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో




చర్చించామని , గతంలో కూడా బకాయిలు ఉండడంతో అప్పులు చేసి బకాయిలు చెల్లించామన్నారు. గత మూడు నెలలుగా వేతనాలు బకాయిలు ఉన్న విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. వారం పది రోజుల్లో బకాయిలను సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు తమపై కక్షతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులుకొయ్యాడ రాజ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు తార, దినసరి కూలీల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

# ఎస్సి హాస్టల్ లో ప్రభుత్వం అందించే స్టీల్ ప్లేట్లను పంపి ణి చేసిన సర్పంచ్....



**ఎడపల్లి,ఆగస్టు 13: (ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలోని షెడ్యూలు కులాల బాలు ర(ఎస్సి)వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్టీల్ ప్లేట్లను స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. అనంతరం వార్డెన్ శ్రీకాంత్ యాదవ్ సర్పంచ్ రాంచందర్ ను శాలువ తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బర్దిపూర్ విట్టల్,షేక్.ముస్తాక్,బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్,వార్డెన్ శ్రీకాంత్ యాదవ్ తదిదరులు పాల్గొన్నారు.

# నేడు బాసరలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి....

## బిజెపి మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పిలుపు....



**బాసర,ఆగస్టు 13: (ప్రజా గళం)**బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం బాసర మండల కేంద్రంలో చేపట్టే హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి బాసర మండల అధ్యక్షుడు పుట్లాల సాయినాథ్ పిలుపునిచ్చారు. ఉదయం. 11:గంటలకు స్వామి వివేకానంద చౌరస్తా నుంచి టెంపుల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని,ఈ సందర్భంగా వివిధ మోర్చా నాయకులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు,ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు.

# ఎడపల్లి జడ్పీ హెచ్ఎస్ కు దాత ఏనుగు దయానంద్ రెడ్డి 45 డ్యూయాల్ డెస్క్ బెంచీలు పంపిణి.....



**ఎడపల్లి,ఆగస్టు 13: (ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ తెలుగు మీడియం పాఠశాలకు దాత ఏనుగు దయానంద రెడ్డి చేయూత అందించారు. 2 లక్షల రూ పాయల విలువైన 45 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాలకు విరాళంగా అందించారు. గురువారం స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్, హెచ్ఎం వేములపల్లి రవికుమార్ సమక్షంలో బెంచీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత ఏనుగు దయానంద్ రెడ్డికి పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు,విద్యార్థులు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్య డు గంగారెడ్డి,బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లెపూ ల శ్రీనివాస్,వార్డు సభ్యుడు ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

# సాలూర క్యాంప్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆటో పట్టివేత....

## - తహసీల్దార్ అజ్మత్ నవాజ్ వెల్లడి...



**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 13:(ప్రజా గళం)**బోధన్ నియోజకవర్గం సాలూర మండలం ఖాజాపూర్ లోని మంజీరా శివారు ప్రాంతం నుంచి బోధన్ వైపు ప్యాసింజర్ ఆటోలో,సంచుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గురువారం రెవెన్యూ సిబ్బంది పట్టుకు న్నారు. ఈ సందర్భంగా సాలూర మండల తహశీల్దార్ అజ్మత్ నవాజ్ మాట్లాడుతూ. సాలూర క్యాంప్ వద్ద రెవెన్యూ ఉద్యోగి సంజీవ్ చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న ఈ వాహనం దొరికిందన్నారు. ఇసుక ట్రాలీ ఆటో ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అజ్మత్ నవాజ్ హెచ్చరించారు.

# హైవే పై రోడ్డు టెర్రర్

## -స్పాట్ లోనే ఇద్దరు మృతి -సంఘటన స్థలాన్ని సందర్శించిన సిపి సాయి చైతన్య





**ఆర్మూర్ ఆగస్టు 13(ప్రజాగళం)**ఆర్మూర్ మండలం గోవింద్ పెట్ బ్రిడ్జి హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలంలోని ఇరువురు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి ,తీర్థ యాత్ర కాస్త విషాదంగా మిగిల్చిన ఘటన ఆర్మూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది.మహారాష్ట్ర నాందేడ్ కిన్వట్ నుండి హైదరాబాద్ చిన్న జీయర్ స్వామి తీర్థయాత్రకు రెండు బస్సులతో తీర్థయాత్రకు బయలుదేరారు.ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్ పెట్ బ్రిడ్జి వద్ద ముందున్న బస్సు టైర్ పంచర్ కావడంతో రెండు బస్సులు హైవే పై నిలిచిపోయాయి.వెనుక బస్సులో ఉన్న ప్రయాణికులు కొందరు టైరు పంచర్ అయినందున మధ్యలోని డివైడర్ పై కూర్చుని సేద తీరుతున్నారు.వెనుక వైపు నుండి వస్తున్న లారీ ఆగి ఉన్న బస్సును ప్రమాదవశాత్తు అతివేగంతో బస్సును ఢీకొంది.దీంతో ప్రయాణికులతో నిండి ఉన్న బస్సు ముందుకు కదలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికుల మీదికి దూసుకెళ్లింది.దీంతో ఇద్దరు మహిళలు కిన్వట్ కు చెందిన సుజాత,మాధవి అక్కడికక్కడే మృతి చెందారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్రేన్ సాయంతో బస్సును పక్కకు మరోల్చారు. సంఘటన స్థలాన్ని జిల్లా సిపి సాయి చైతన్య సందర్శించారు. మృతదేహాలను ఆర్మూర్ ఏరియా ఆసుపత్రి కి తరలించి, ఆర్మూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# బోధన్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ పామూరు సురేష్...



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 13:**(ప్రజా గళం)బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని నిజా మాబాద్ అడిషనల్ కలెక్టర్ పామూరు సురేష్ గురువా రం సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మున్సి పల్ కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించార ు.అనంతరం బోధన్ పట్టణంలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,పారిశుద్ధ్య నిర్వహణ,పరిసరాల పరిశుభ్రత,ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలపై మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ను అడిగి తెలుసుకున్నారు.వార్డుల వారీగా సమస్యల ను గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల పై వివరాలు సేకరించారు.పట్టణంలో పారిశుద్ధ్య నిర్వ హణపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచిం చినట్లు తెలిసింది.అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించి,ఆయా శాఖల పరిధి లోని సమస్యలు,పెండింగ్ పనులు,వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకు న్నారు.అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అడిషన ల్ కలెక్టర్ పామూరు సురేష్ సూచించారు.

# ఎడపల్లి గ్రామంలోని స్థానిక సమస్యలు పరిష్కరించా ...

## - కలెక్టర్ భవేష్ మిశ్రాకు విన్నవించిన సర్పంచ్ కందగట్ల రాంచందర్....



**ఎడపల్లి,ఆగస్టు 13:** (ప్రజా గళం)నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూ ర్బా గాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం తనిఖీ కి విచ్చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ భవేశ్ మిశ్రా కి స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ స్థానిక సమస్యలు పరిష్కరిం చాలని విన్నవించారు. అంతకుముందు కలెక్టర్ ని సర్పంచ్ రాంచందర్ శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు.అనంతరం స్థానిక సమస్యలను అయన దృష్టకి తీసు కెళ్లి పరిస్కరించాలని కోరారు.కెజిబివి పాఠశాలలో వి ద్యార్థులకు సరైన బెడ్స్ లేవని, అలాగే హిందీ టీచర్ కూ డా లేరని తెలిపారు.జిల్లా పరిషత్ పాఠశాలకి పిఈటి లే రని ఆ స్థానాన్ని వెంటనే భర్తీ చేయాల ని కోరారు.స్థానిక రెండవ నెంబర్ అంగన్ వాడి భవనం శిథిలావస్థలో ఉన్నదని,వర్షం పడి భవనంలోకి నీళ్లు చేరుతున్నాయని,దింతో చిన్నారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని,కావున అంగన్ వాడి కేంద్రంను అక్కడే నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ కి తాత్కాలికంగా మార్చాలని సర్పంచ్ కందగట్ల రాంచందర్ కలెక్టర్ ని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ విన్నపానికి కలెక్టర్ భవేష్ మిశ్రా సానుకూలంగా స్పందించడం జరిగింది అని అయన తెలిపారు.సర్పంచ్ వెంట బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లెపూల శ్రీనివాస్,రాఘు, ద్యాకం సాయిలు,తదితరులు ఉన్నారు.

# భైంసాలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ....ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసి దేశభక్తిని చాటా లి....

## ముధోల్ శాసనసభ్యులు పవార్ రామరావు పటే ల్ పిలుపు....



బాసర,ఆగస్టు 13:(ప్రజా గళం)నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని భైంసా పట్ట ణంలో గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు.జాతీయ జెండా ను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న ఆయన దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ను ఎగుర వేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవ డంతో పాటు జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.యువత పెద్ద సంఖ్యలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు నాయకులు ,కార్యకర్తలు,యువత తదిత రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

# రుద్రూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట హమాలీ కార్మికుల ఆందోళన!....

## ఇందిరమ్మ ఇండ్లు,పెన్షన్ ఇవ్వా లని,కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,

### - సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ డిమాండ్...



**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 13:**(ప్రజా గళం)బోధన డివిజన్ రుద్రూర్ మండల తహసీల్దార్ కార్యాల యం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం హమాలీ కార్మికులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భం గా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని తహసీల్దా ర్ తారాబాయికి వినతిపత్రం అందజేశారు.ఈ సంద ర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ మాట్లా డుతూ,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి నట్లుగా హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని కోరారు.55 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులందరికీ 6వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.120 గజాల స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు భీమయ్య, మహబూబ ్,లక్ష్మణ్,సాయిలు,పీరయ్య,గంగాధర్, కిరణ్,హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం...!

మార్కెట్ పల్స్ ఆర్బీఐ ద్రవ్య సమీక్ష, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు, వర్షపాతం అంచనాలు కీలకం దేశీయ స్టాక్ మార్కెట్లను పశ్చిమాసియా సంక్షోభానికితోడు వర్షాభావ పరిస్థితుల భయాలు వెంటాడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినా.. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే వీలుందన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నా యి మరి. ఈ కారణంగానే గత వారం చివరి రోజు ట్రేడింగ్‌లో సూచీలు భారీ నష్టాలకు లోనయ్యాయి. దీంతో అంతకుముందు వారంతో పోల్చితే గత వారం సెన్సెక్స్ 639.61 పాయింట్లు లేదా 0.84 శాతం పడిపోయి 74,775.74 దగ్గర నిలిచింది. నిఫ్టీ 171. 55 పాయింట్లు లేదా 0.72 శాతం కోల్పోయి 23,547.75 వద్ద స్థిరపడింది. ఇక ఈ వారం ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష ఉన్నది. ఇందులో నిర్ణయాలు బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లను ఎక్కువగా ప్రభావితం చేయనున్నాయి. విజృంభిస్తున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కీలక వడ్డీరేట్లను పెంచితే సెల్లింగ్ ప్రెషర్ ఖాయమని చెప్పవచ్చు. తగ్గిస్తే పెట్టుబడులకు మద్దతు లభించినట్టే అనుకోవచ్చు. అలాగే మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు పెరిగితే క్రూడాయిల్ రేట్లు పరుగులు పెట్టే అవకాశాలున్నాయి. దీంతో చమురు, సహజ వాయువు ఆధారిత రంగాల్లో అమ్మకాల ఒత్తిడి తప్పదు. అయితే శాంతి స్థాపనకు అడుగులు పడితే మార్కెట్లు పుంజుకోవచ్చు. తగ్గే ముడి చమురు ధరలు ఇందుకు దోహదం చేయగలవు. కానీ దేశీయ మార్కెట్లో పెరుగుతున్న పెట్రో ధరలు.. ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయి. ఈ క్రమంలో సెంట్రల్ బ్యాంక్ రెపో రేటు పెరుగుతుందన్న అంచనాలే గట్టిగా వినిపిస్తున్నాయి. కాగా, జనవరి-మార్చికిగాను ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం కూడా మార్కెట్ ట్రేడింగ్‌పై ఒకింత ఉ ఒడనున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడులు ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ఇటీవలికాలంలో రూపీ వాల్యూ పెరుగు తుండటం ఒకింత సానుకూల అంశంగానే చెప్పుకోవచ్చు.

# బోధన్ 100 స్తంభాల గుడికి ఫెన్సింగ్,వాచ్‌మెన్ నియా మకం!....

## - పురావాస్తు శాఖ అధికారులు వెల్లడి...వంద స్థంభాల ఆలయాన్ని పరిశీలించిన తెలంగాణ పురావా స్తు అధికారులు...




**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 13:**(ప్రజా గళం)బోధన్ పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధి గాంచిన 100 స్తంభాల ఆలయాన్ని తెలంగాణ పురావస్తు శాఖ అధి కారులు పరిశీలించారు.శిథిలావస్థకు చేరు తున్న ఆలయ ప్రాంగణా న్ని పరిశీలించిన అధికారులు ఆలయ పరిరక్షణకు అవసర మైన చర్యలు చేపడతామ ని తెలిపారు.ఆలయ రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు,భద్రత కోసం వాచ్‌మెన్‌ను నియమి స్తామని పురావస్తు శాఖ అధికారులు హామీ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో ఆక్రమణ లు జరిగాయా అనే విషయాన్ని గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహిం చాలని స్థానికులు అధికారులను కోరారు. ఆలయానికి సంబంధించిన ఎకరం పది గుంటల భూమిని పూర్తిగా గుర్తించి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు తావులే కుండా పరిరక్షించాలని యోగ్ ధారణ ఫౌండేషన్ వ్యవ స్థాపకులు ఉదయ్ మహారాజ్, అడ్వకేట్ సాయి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ధర్మతో పాటు స్థానికు లు పురావస్తు శాఖ అధికారుల ను కోరారు.చారిత్రక ప్రాధాన్య త కలిగిన ఆలయాన్ని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు బోధన్ చారిత్రక వారసత్వాన్ని అందించవ చ్చని వారు పేర్కొన్నారు.ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపర చడంతో పాటు అవసరమైన మరమ్మతు లు చేపట్టి, సందర్శకులకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని కోరారు.పురావస్తు శాఖ అధికారులు ఆలయ పరిస్థితు లను పరిశీలించి, సంబంధిత అంశాలను ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు.ఆలయానికి ఫెన్సింగ్,వాచ్ మెన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# 'రామాయణ'లో కాజల్.. ఆసక్తిగా ఉందన్న నటి..!



సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉ ంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణు డిగా కనిపించను న్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారి కంగా వెల్లడించారు.జాన్వీకపూర్‌ను ట్రోల్ చేయొద్దు: జగప తి బాబు రిక్వెస్ట్ భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. "5000 సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉ ంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం" అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.

# ఇరాన్ పౌరుల కోసం విరాళాలు.. సౌదీలో ఇద్దరు భారతీయుల అరెస్ట్



ఇరాన్ పౌరులకు సాయం చేయబోయి ఇద్దరు భారతీయ సోదరులు విదేశంలో చిక్కుల్లో పడ్డారు. టెహ్రాన్ ఎంబసీకి విరాళం పంపడంతో వారిని సౌదీ అరేబియా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాకు చెందిన మహమ్మద్ జాఫర్ ఐదేళ్ల కిందట ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వలస వెళ్లాడు. కొన్నాళ్లకు అతడి సోదరుడు మహమ్మద్ రహీబ్‌ను కూడా తీసుకెళ్లాడు. ఇటీవల పశ్చిమాసియాలో యుద్ధం వేళ ఇరాన్ (×త్తుఅ) పౌరులకు సాయం చేయాలని జాఫర్‌ను అతడి తల్లి కోరారు. దీంతో భారత్‌లోని ఇరాన్ దౌత్యకార్యాలయ బ్యాంకు ఖాతాకు అతడు 200 రియాల్స్ నగదును విరాళంగా ఇచ్చాడు. అయితే, ఆ డబ్బును తన సోదరుడు రహీబ్ ఫోన్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేశాడు.

ట్రంప్ వద్దన్నా.. ఆగని ఇజ్రాయెల్.. తగ్గని ఇరాన్ విషయం తెలుసుకున్న సౌదీ అరేబియా భద్రతా సిబ్బంది మార్చి 27న రహీబ్‌ను అరెస్టు చేసి విచారణ జరిపారు. మూడు రోజుల తర్వాత జాఫర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు ఎక్కడున్నారో తెలియరాలేదు. దీంతో భారత్‌లోని వీరి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తూ కేంద్రాన్ని సాయం కోరారు. తమ కుమారులను విడిపించా లనివిదేశాంగ శాఖను అభ్యర్థించారు. ఈ ఘటనపై రియాద్‌లోని భారత ఎంబసీ అధికారులు స్పందించారు. భద్రతా సంబంధిత వ్యవహారాల్లో జాఫర్, రహీబ్‌లను సౌదీ పోలీసులు అరెస్ట్ చేశారని, దీనిపై ఆ దేశ విదేశాంగ శాఖను సంప్రదిస్తున్నట్లు తెలిపారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com